సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా చంద్రమోహన్ గౌడ్



గౌలిపురా: ఆగస్టు 20 నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగిన 4వ సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో పాతబస్తీ గౌలిపురాకు చెందిన గడ్డమీది చంద్రమోహన్ గౌడ్‌ను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ గౌలిపురా డివిజన్ సీపీఐ కార్యదర్శిగా పదేళ్లుగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ జిల్లా పార్టీలో సమితి సభ్యుడిగా, కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతూ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం చంద్రమోహన్‌గౌడ్ అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు.

బాక్సింగ్‌లో ఉమెర్ ఆబిద్ అలీ ప్రతిభ



కోచ్ ఏజాజ్ అహ్మద్‌తో ఉమెర్ ఆబిద్ అలీ

గోల్కొండ: క్రమశిక్షణతో ప్రాక్టిస్ చేస్తే బాక్సింగ్‌లో విశేషంగా రాణించవచ్చునని బాక్సింగ్ కోచ్ ఏజాజ్ అహ్మద్ అన్నారు. రేతిగల్లిలోని ఒవైసీ కమ్యూనిటీ హాల్‌లోని గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌లో సబ్ జూనియర్ బాలబాలికల శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. శిక్షణలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఆయన సన్మానించి గ్లౌస్ బహూకరించారు. దశాబ్ద కాలంగా హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ అంతా బాక్సింగ్‌కు సబ్ జూనియర్, జూనియర్ స్థాయిలలో ఆసక్తి పెరిగిందన్నారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం కనీసం నెలకు నాలుగు రోజుల పాటు బాక్సింగ్ శిక్షణ ఇప్పించాలని ఆయన పేర్కొన్నారు.

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



మహ్మద్ షబ్బీర్ అహ్మద్

శాలిబండ: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురి కాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎస్పీడీసీఎల్ చందులాల్ బారాదరి ఏఈ మహ్మద్ షబ్బీర్ అహ్మద్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..గాలి, దుమారం, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగల కింద ఐరన్ పోల్‌కు దగ్గర ఉండొద్దన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో చెత్తాచెదారం వేయకూడదని సూచించారు. ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు 1912కు లేదా చందులాల్ బారాదరి ఏఈ (8712470809), (8712470726) నంబర్లలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

'అయ్యప్ప భక్తులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి'

గన్‌ఫౌండ్రీ: అయ్యప్ప భక్తుపై జరుగుతున్న దాడులను రెండు రాష్ట్రాల భక్తులు అరికట్టాలని అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ బి.ఈశ్వరయ్య గురుస్వామి కోరారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ కార్యాలయంలో నాలుగు రాష్ట్రాల సభ్యుల సమావేశం, కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అయ్యప్ప సేవలో ముందుండే వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని, జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి ముందుకు సాగుతామని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తులు 50 శాతం వరకు శబరిమలకు వెళ్తున్నారని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాల భక్తులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆది మోహన్‌రెడ్డి, రుద్ర కోటేశ్వర్ రావు, రాజేష్ గౌడ్, సర్క సిద్ధు, డాక్టర్ బాలు, అనంతరావు, వైకుంఠం పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 16వ డివిజన్ రఘురాంనగర్ కాలనీలో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వార్డు ఇన్‌చార్జ్ టింకురెడ్డితో కలిసి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచితంగా డాక్టర్ల బృందం వైద్య సేవలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నందుకు చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీని అభినందించారు. ఉచిత క్యాంప్‌లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏరియా ఆసుపత్రికి సుస్తీ



ఆసుపత్రిలో రోగుల రద్దీ

నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతుల కరువు

- గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన దుస్థితి
- శిథిలావస్థలో ఓపీ బ్లాక్
- ఇబ్బందులు పడుతున్న రోగులు



వర్షానికి కారుతున్న పైకప్పు

నాంపల్లి: ఏరియా ఆసుపత్రికి రోగుల రద్దీ ఎక్కువైంది. ఈ ఆసుపత్రికి నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన రోగులు అత్యధికంగా తరలివస్తుంటారు. ఇక్కడ రోగం నయం అవుతుందో లేదో తెలియదు. కానీ ఇక్కడకు వచ్చిన రోగులు మాత్రం నానా అవస్థలు పడుతున్నారు. వైద్యుడిని కలిసి రోగం బాధ చెప్పుకునేందుకు కావాల్సిన రశీదు కోసం క్యూలైన్‌లో నిల్చున్నప్పటి నుంచి మందులు తీసుకుని తిరిగి ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లే వరకు రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు, మూత్ర శాలలు లేకపోవడంతో ఆసుపత్రి బయట ఉండే సులభ్ కాంప్లెక్స్‌కు రోగులు పరుగులు తీస్తున్నారు.

వానొస్తే వణుకే..

నాంపల్లి ఏరియా ఆసుపత్రి ఓపీ బ్లాక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ బ్లాక్ పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతోంది. కారుతున్న నీటిలోనే వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి ఓపీ బ్లాక్ పూర్తిగా తడిసి ముద్దవుతోంది. పైకప్పులు పెచ్చులూడి ఎక్కడ పడుతాయోననే భయాందోళనలో రోగులు, వైద్యులు ఉంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి సోకిన జలుబు, జ్వరం కోసం ఇక్కడకు వస్తే ఇక్కడ సరైన సదుపాయాలు లేక రోగులు బిక్కు బిక్కుమంటూ చికిత్స పొందుతున్నారు. రసీదు కౌంటర్లు, ఇంజెక్షన్ గదులు, బీపీ చెకప్ గదులు, వైద్య పరీక్ష గదులు పూర్తిగా నీట మునుగుతున్నాయి.

ఎప్పుడూ సర్వర్ డౌనే..

ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ రకాల రక్త పరీక్షలు జరుగుతుంటాయి. ఈ పరీక్షలు జరగాలంటే, నమూనాలు, నివేదికలు పొందాలంటే తప్పనిసరిగా సర్వర్ ఉండాలి. ఈ పరీక్షలన్నీ ఇక్కడే జరగవు. కొన్ని పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌తో అనుసంధానంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా వాతావరణ ప్రభావం మూలంగా సర్వర్ తరచూ మొరాయిస్తోందని రోగులు, వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఆసుపత్రి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తుంది. ఈ మధ్య కాలంలో కనీసం ఒక గంట కూడా సర్వర్ పనిచేయడం లేదు.

ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించాలి..

నాంపల్లి ఆసుపత్రి ఏరియా ఆసుపత్రికి చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఉన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికై రెండేళ్లు కావస్తోంది. రెండేళ్ల కాలంలో కేవలం ఒకసారి మాత్రమే ఆసుపత్రికి వచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రికి వచ్చినా అభివృద్ధిపై చర్చ జరగలేదని వైద్యుల బృందం పేర్కొంటోంది. కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధిపై ఏరియా ఆసుపత్రిలో కమిటీ కూర్చోవాలి. కానీ ఇక్కడ అలాంటిదేమి లేదని రోగులు, వైద్యులు, స్థానికులు వాపోతున్నారు. ఆసుపత్రి అభివృద్ధిపై తక్షణమే కమిటీ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది.

రోగులకు తగ్గట్టు సేవలు లేవు..



ఆసుపత్రికి రోగుల సంఖ్య ఎక్కువ అవుతోంది. రోగులకు తగ్గట్టు సేవలు లేవు. వర్షం వస్తే ఓపీ బ్లాక్‌లో నిల్చోవాలంటే చోటు ఉండదు. అలాంటి పరిస్థితుల్లో రోగులకు వైద్యులు సేవలందిస్తున్నారు. ఈ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

పూజారీలాల్, బీఆర్ఎస్ నేత

మెరుగైన సేవలు అందిస్తున్నాం..



ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. ఆసుపత్రి సమస్యలను ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నా. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఇందులో ఎలాంటి రాజీ లేదు. మెటర్నటీ కేసులు అధికం అయ్యాయి. నిలోఫర్ తర్వాత అధికంగా పాతబస్తీ నుంచి నాంపల్లి ఏరియా ఆసుపత్రికే వస్తున్నాయి. ఓపీ బ్లాక్‌ను పునరుద్ధరించే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

డాక్టర్ చంద్రారెడ్డి, సూపరింటెండెంట్

ఆసుపత్రిలో అధ్వానంగా పారిశుద్ధ్యం..



ఏరియా ఆసుపత్రిలో రోగులకు తగ్గట్టు సేవలు లేవు. వైద్యులు కూడా రోగి నాడి పట్టుకోకుండా మందులు రాస్తున్నారు. మందులు సైతం కొన్ని బయటకు రాస్తున్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఆసుపత్రిలో రోగులకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవు. ఒంటికి, రెంటికి వస్తే బయటకే వెళ్లాల్సి వస్తోంది.

రాహుల్‌చంద్ర, బీజేపీ నాంపల్లి ఇన్‌చార్జి

హిందూ సంస్కృతి ఎంతో గొప్పది



బండారి వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: హిందూ సంస్కృతి ప్రపంచంలోనే అత్యున్నతమైనదని బండారి విద్యా సంస్థల చైర్మన్ బండారి వెంకటేష్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో భజన భారతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణ ఆలయంలో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..పిల్లల్లో చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు ఇటువంటి భజన పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. భజన భారతి వారు మూడు దశాబ్దాలకు పైగా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డిపాఠశాలలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో 21 టీంలు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, అన్నాయాదవ్, వజ్రలింగం, రాధాకృష్ణ, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, జొన్నకుంటి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి రంగాచార్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నారాయణరెడ్డి, రాధాకుసుమ తదితరులు

గన్‌ఫౌండ్రీ: దాశరథి రంగాచార్య నవలలు చారిత్రకమైన సంపద అని ప్రముఖ కవి డాక్టర్ సింకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమి, తెలుగు భాషా, చైతన్య సమితి సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ దాశరథి రంగాచార్య 9వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ..దాశరథి రంగాచార్య సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ప్రస్తుత యువత ఆయన పుస్తకాలను చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్‌పర్సన్ డాక్టర్ రాధాకుసుమ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దాశరథి రంగాచార్య కుమారుడు దాశరథి విరించి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్, సాహితీవేత్త రామకృష్ణ చంద్రమౌళి, తెలుగు భాషా, చైతన్య సమితి సంపాదకులు జయప్రకాష్, వ్యవస్థాపక అధ్యక్షుడు బడే సాబ్ పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి



నవీన్ నికోలస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: విద్యాశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీఎస్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కర్, కార్యదర్శి మహ్మద్ ఫక్రుద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీపీసీ ఆమోదించిన ఖాళీలు వెంటనే పూర్తి చేస్తే ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం మొత్తం 13 ఖాళీలు ఉన్నందున వాటిని వేగవంతంగా భర్తీ చేస్తే విద్యాశాఖ పరిపాలన మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ మొజాహిద్ అలీ, కె.రమేష్, కె.సుదర్శన్, ఆర్.శివ, శేఖర్, ఫిరోజ్ అహ్మద్, జావీద్, అనిల్, మురళి, విజయ రావు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: శ్రావణ ఆదివారం సందర్భంగా రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలో కొలువుదీరిన ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రమాదకర కేబుల్ వైర్లను తొలగించాలి



మీరాలంమండి ఆలయం రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్, కేబుల్ వైర్లు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం రోడ్డులో ప్రమాదకరంగా మారిన విద్యుత్, కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని మీరాలంమండి ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య సంబంధిత విద్యుత్ అధికారులను కోరారు. ఆలయానికి ప్రధాన రోడ్డులో ఉన్న వీటిని సరి చేయడమో.. లేక పూర్తిగా తొలగించడమో చేయాలని ఆయన టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ డీఈ మల్లాది శ్రీధర్‌ను కోరారు. అక్కడక్కడ చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదాలతో తమ ఆలయానికి వచ్చే భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని..వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయం



రావినూతల శశిధర్

అబిడ్స్: గణేష్ మండపాలతో పాటు దుర్గామాత మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అంగీకరించిందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ వెల్లడించారు. తమ ఉత్సవ సమితి డిమాండ్ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గణేష్ మండపాలు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆదేశించడం హర్షణీయమన్నారు. టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్‌శాఖ అధికారులు ముఖ్యమంత్రి ఆదేశంతో చట్టపరంగా ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తరఫున ధన్యవాదాలు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు అందరూ స్థానికంగా మండపాలకు ఉచిత విద్యుత్ పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మజ్లిస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం



నానల్‌నగర్ ఖాదర్‌బాగ్‌కు చెందిన మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో యువతకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన ఖాదర్‌బాగ్ బస్తీకి చెందిన పలువురు యువకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ ఏరియా కమిటీలలో యువతకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు.

ఒత్తిళ్లకు లొంగవద్దు..

విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుల్స్ నిర్వాహకుల వైర్లను తొలగించడంలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగవద్దు అని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నిజాం కాలనీ, టోలిచౌకీ, అల్‌అసనత్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు వేసిన ప్రైవేటు కెబుల్స్‌ను తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న నానల్‌నగర్ విద్యుత్ ఈఈ ముస్తఫా బాబాతో మాట్లాడారు

'డప్పు కళా విన్యాసం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బలగం సినిమా దర్శకుడు వేణు తదితరులు

గన్‌ఫౌండ్రీ: డప్పు వాయిద్యాలపై పరిశోధన చేసి ఒక పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని బలగం మూవీ డైరెక్టర్ వేణు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అనిల్ ఆర్ట్ బీట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ రచయిత మోత్కూరి అనిల్‌కుమార్ రచించిన 'డప్పు కళా విన్యాసం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డప్పు నేర్చుకునే విధానంపై వచ్చిన మొట్టమొదటి పుస్తకమని కొనియాడారు. తన రాబోయే సినిమాలో డప్పు వాయిద్యానికి సంబంధించిన కొన్ని అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం పద్మజారెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్, జానపద కళల విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య వెంకటేశ్వర్లు, సంస్కార భారతి రాష్ట్ర సంఘటన మంత్రి జమల్‌పూర్ నిరంజన్ పాల్గొన్నారు.

ప్రమోద్ గోపిశెట్టి సేవలు అభినందనీయం



ప్రమోద్ గోపిశెట్టిని సన్మానిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు

జియాగూడ: 23 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ మొదటి వైస్ ప్రెసిడెంట్ లయన్ ప్రమోద్ గోపిశెట్టి చేస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం కార్యాలయంలో లయన్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 23 ఏళ్లుగా సేవలందిస్తున్న లయన్ ప్రమోద్ గోపిశెట్టిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రమోద్ గోపిశెట్టి మాట్లాడుతూ..లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత వైద్యం, ఉచిత కంటి పరీక్షలు, అవగాహన ర్యాలీలు, తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యుడు డాక్టర్ చింతకుంట మాణిక్, ఫిల్మ్ ఆర్టిస్ట్ ఓంకార్‌రాజు, జర్నలిస్ట్ సి.ప్రదీప్‌కుమార్, వనితా కాలేజీ లయన్ దివాకర్ దీపాల పాల్గొన్నారు.

కుల సంఘాలు హైందవ సంస్కృతిని పరిరక్షించాలి



మాట్లాడుతున్న దేవజీ రావత్ తదితరులు

జియాగూడ: కుల సంఘాలు ఆత్మీయంగా ఉంటూ హైందవ సంస్కృతిని పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ అఖిల భారతీయ కార్యదర్శి దేవ్‌జీ రావత్ అన్నారు. ఆదివారం జియాగూడ సమర్థ కామధేను గోశాల ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ, సామాజిక సమరసత అభియాన్, కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అణగారిన వర్గాల అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. సాదు పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామిజీ మాట్లాడుతూ..హైందవ సంస్కృతి సంప్రదాయాలను గ్రామగ్రామానికి విస్తరింపజేయాలన్నారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నరసింహామూర్తి మాట్లాడుతూ..సామాజిక సమరసత అభియాన్ ద్వారా ప్రతి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. చివరగా ఆశ్రమ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ గో రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత ప్రాంత సహ ప్రముఖ్ కమల్ వీరేష్, ప్రాంత ప్రముఖ్ ధనుంజయ, విహెచ్‌పి, ప్రాంత కార్యదర్శి లక్ష్మీనారాయణ, జి.శివరత్నం, జియాగూడ అధ్యక్షులు జగదీష్ యాదవ్, లక్ష్మీనారాయణ, మధిర సత్యనారాయణ, మహేష్కర్ కాంతిలాల్, డి.సంతోష్, ధర్మారామ్ దాక పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరసింహులు

సుల్తాన్‌బజార్: గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ నరసింహులు సూచించారు. ఆదివారం ఐఎంఏ హాల్‌లో డివిజన్ పరిధిలోని గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సుల్తాన్‌బజార్ ఏసీపీ డివిజన్ పరిధిలోని నారాయణగూడ సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతి మండపం వద్ద ప్రత్యేక్య నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండపం వద్ద అపరిచిత వ్యక్తులు అనుమానాస్పద వస్తువులు కనబడితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ డీఐ ధర్మారావు ఎస్ఐలు సాయిరాం స్వామి, వేణు, జైన్ మైనార్టీ కౌన్సిల్ సెక్రెటరీ రిదేష్ జాగిర్దార్, శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ కమిటీ మెంబర్ భారతిబెన్ పటేల్, సోషల్ వర్కర్ భారతి చంద, అలీతో పాటు గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మనోహరం.. నృత్య నాటక సౌరభం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: దేశభక్తి, ప్రేమ భక్తి, మానవతావాదం వంటి అంశాలపై సాగిన నృత్య నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంల నృత్య నాటక సౌరభం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ణ ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువు డాక్టర్ స్మితా మాధవ్ శిష్యబృందంచే ఆత్మావత్ సర్వభూపేషు నృత్య రూపకం, గరికపాటి ఉదయభాను రచించిన ఛరణదాస్ నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం తెలుగు విశ్వ విద్యాయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ..సంగీత నాటక అకాడమీ విశేష కార్యక్రమాలను నిర్వహిస్తుందని అభినందించారు. సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం గడిచిందని, ఈ సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, గోథే జంత్రం డైరెక్టర్ అమితా దేశాయ్, ఆర్.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.